

యాచారం ప్రభుత్వ దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక


నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | VIKARABAD


## ఎక్కడ చదివినా.. చెప్పేస్తుంది..!

**విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం యాప్‌లోనే**

**వీటి ఆధారంగానే మధ్యాహ్న భోజనం,**

**దుస్తులు తదితర పథకాల వర్తింపు**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 ( నమస్తే తెలంగాణ ) : విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం, పాఠశాలల పరిస్థితులు, కావాల్సిన సదుపాయాలు? ఇలా ఒక్కటేమిటీ పాఠశాలలకు సంబంధించిన పూర్తి సమాచారంపై స్పష్టత రానున్నది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'యూడైస్' పోర్టల్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పోర్టల్‌లో ప్రతీ విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ ఇస్తారు. దీంతో ఆ విద్యార్థి దేశంలో ఎక్కడ.. ఏ చదువు చదివినా తెలిసిపోతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పోర్టల్‌లో ప్రతీ విద్యార్థి యూడైస్‌లో నమోదు కావాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల వివరాలన్నీ ఒకే చోట నమోదు చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ విద్యాశాఖాధికారులకు యూడైస్ పోర్టల్‌పై శిక్షణ కూడా ఇస్తున్నారు. యూడైస్‌లో పొందుపర్చిన సమాచారానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు తదితర పథకాల వర్తింపు ఉండనున్నది. వివిధ రకాల నిధులనూ యూడైస్ ఆధారంగానే కేటాయిస్తారు.

## విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- రోగులకు మెరుగైన వైద్యం అందించండి
- వైద్యులు అందుబాటులో ఉండాలి
- దవాఖాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- యాచారం ప్రభుత్వ దవాఖాన ఆకస్మిక తనిఖీ

యాచారం, సెప్టెంబర్ 14 : 'విధుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.. 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండాలి... రోగులకు మెరుగైన వైద్యం అందించండి..' అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆర్డీవోతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం ఎలా అందుతున్నది.. మందులు సరిగా ఇస్తున్నారా.. అంటూ రోగులను ఆరా తీశారు. దవాఖానలోని ఎక్స్‌రే ఆపరేటింగ్ గది, మరుగుదొడ్లు, రోగులకు ఏర్పాటు చేసిన పడకలు, శిథిలావస్థలో ఉన్న దవాఖాన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నూతన దవాఖాన భవన నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ప్రస్తుతం ఈ దవాఖానలో నలుగురు ఎంబీబీఎస్ డాక్టర్లు, ఇద్దరు స్పెషలిస్టులు, 11మంది స్టాఫ్ నర్సులు, 11 మంది సిబ్బంది ఉన్నారని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. దవాఖానలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు ఇక్కడే చేయాలని, రోగులను ఇబ్బందులకు గురి చేయవద్దని హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో దురుసుగా వ్యవహరించవద్దన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## నిమజ్జన ఘట్టానికి పటిష్ట భద్రత

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- శోభాయాత్ర మార్గాలను పరిశీలించిన డీజీపీ
- 17న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సెలవు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 ( నమస్తే తెలంగాణ )/బడంగ్‌పేట: నగరంలో 17న జరిగే గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. బాలాపూర్ విఘ్నేశ్వరుడిని శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, నగర సీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, శశాంక్, రాచకొండ సీపీ సుధీర్‌బాబులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా బాలాపూర్ నుంచి చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, లాల్‌దర్వాజ, చార్మినార్, ఎంజే మార్కెట్, బషీర్‌బాగ్, ట్యాంక్‌బండ్ వరకు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో 25వేల మంది పోలీసులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. శోభాయాత్ర సాగే మార్గాల్లో ఏర్పాట్లు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను కంట్రోల్ రూం ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. నిమజ్జన యాత్ర కొనసాగే ప్రతీ మార్గంలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఇందుకోసం 15 వేల సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. గతేడాది కంటే ఈసారి 15 శాతం విగ్రహాలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నదన్నారు. ఇందుకు అనుగుణంగానే ఏర్పాట్లు, అదనంగా చేసినట్లు వెల్లడించారు. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో 15వేల మంది సిటీ పోలీసులు, 10వేల మంది జిల్లాల నుంచి పోలీసులను రప్పిస్తున్నట్లు నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈనెల 17న సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



మాసబ్ చెరువు

# ఆనవాళ్లు లేకుండా..

## కబ్జా కోరల్లో మాసబ్ చెరువు

**చెరువులు.. కుంటలు.. కబ్జాకు కావేవీ అనర్హం..అన్నట్లుగా సాగుతున్నది రంగారెడ్డి జిల్లాలో ఆక్రమణల పర్వం. కొందరు చెరపట్టి నీటి వనరులనూ మాయం చేస్తున్నారు. హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న మాసబ్ చెరువు సైతం ఆక్రమణల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నది. రియల్టర్ల కన్ను ఈ చెరువుపై పడడంతో చెరువు విస్తీర్ణం క్రమక్రమంగా హారతి కర్పూరంలా కరిగిపోతున్నది. చెరువు పరి రక్షణ సమితి పేరిట స్థానికులు పోరాటం చేస్తున్నా ఆక్రమణల తంతుకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు.**

**- రంగారెడ్డి, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ)**





తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలతో చెరువు ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. కొన్నేండ్లుగా సాగుతున్న ఆక్రమణల పర్వం నేటికీ సాగుతుండడంతో చెరువు ఆనవాళ్లే లేకుండా కుంచించుకుపోతున్నది. చెరువుకు సంబంధించిన భూముల్లో పెద్ద ఎత్తున వెంచర్లు, కట్టడాలు వెలిశాయి. మాసబ్‌చెరువు 490 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. ఇందులో కొంతమేర పట్టా భూములుండగా.. అవి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోనే ఉన్నాయి. భూముల ధరలు పెరుగడంతో చాలామంది రైతులు తమ భూములను అమ్ము కున్నారు. ఇదే అదనుగా రియల్టర్ల కన్ను ఈ చెరువుపై పడింది. ఇష్టానుసారంగా వెంచర్లు చేసి ప్లాట్లను విక్రయించారు. చెరువు చుట్టూ ఉన్న తుర్కయాంజాల్, ఇం జాపూర్, గుర్రంగూడ, ఆదిత్యనగర్, ఏవీనగర్‌వాసులు ప్లాట్లను కొనుగోలు చేసి చెరువు ప్రాంతాన్ని మట్టి పోసి పూడ్చివేస్తున్నారు. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోనూ పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. ఒకప్పుడు మాసబ్ చెరువు 30 గ్రామాలకు సాగునీటిని అందించేందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని.. క్రమక్రమంగా ఆ చెరువే కనుమరుగయ్యే దుస్థితికి వచ్చిందని వాపోతున్నారు.

### మొద్దునిద్ర వీడని అధికార యంత్రాంగం..

దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి సాగు నీరందించిన మాసబ్ చెరువును పరిరక్షించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఆక్రమణల చెర నుంచి విముక్తి కల్పించాలని ఈ ప్రాంతవాసులు ఫిర్యాదులు చేస్తున్నా మొద్దునిద్రను మాత్రం వీడడం లేదు. గతంలో సర్వేనం.205లో సుమారు 5 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కొందరు యత్నించారు. 60 ఫీట్ల మేర రోడ్డును సైతం నిర్మించారు. స్థానికులు అడ్డుకోవడంతో ఆ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది. పోలీసులకు ఫి ర్యాదు చేశామని చెప్పి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఆ తర్వాత కూడా చెరువుకు సంబంధించిన భూముల్లో ఆక్రమణలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదు. ఫేక్ ఎన్‌వోసీలతో అక్రమంగా అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా ఆ దిశగా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్న సందర్భాలూ లేవు. నేటికీ కొంత మంది గ్రీన్‌నెట్‌ను పరదలా అడ్డుకట్టి నిర్మాణాలు చేపడుతున్నా వాటిని ఆపేందుకు సాహసం చేయడం లేదు. అధికారు లు మౌనముద్ర దాల్చడంపై స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి

- రియల్టర్ల కన్ను ఈ చెరువుపై పడడంతో హారతి కర్పూరంలా కరిగిపోతున్న విస్తీర్ణం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ప్లాట్లు చేసి విక్రయాలు
- ఫేక్ ఎన్‌వోసీలతో అనుమతులు పొంది యథేచ్ఛగా నిర్మాణాలు
- హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో అధిక ధర
- తటాకంలో కొనసాగుతున్న ఆక్రమణల పర్వం.. చోద్యం చూస్తున్న అధికారులు

### చెరువు పరిసరాలు కంపు..కంపు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాసబ్‌చెరువును ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టిం ది. రూ. 2 కోట్లతో హెచ్‌ఎండీఏ అధికారులు సుందరీకరించి.. అన్ని రకాలుగా అభివృద్ధి పరిచారు. చెరువుకట్టపై పూల మొక్కలను ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేశారు. దీంతో చెరువు అందాలను ఆస్వాదించేందుకు పిల్లలు మొదలుకుని వృద్ధుల వరకు అందరూ సందర్శించేవారు. అయితే చెరువు ఎగువన ఉన్న బడంగ్‌పేటతోపాటు ఇతర ఆవాసాల నుంచి వచ్చే మురుగునీరంతా చెరువులోకే వెళ్తుండడంతో నీరంతా దుర్గంధంగా మారుతున్నది. పరిసరాలు కంపు కొడుతుండడంతో చెరువు సందర్శనకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. స్వచ్ఛతకు మారుపేరుగా ఉన్న చెరువు నేడు దుర్గంధంగా మారడం.. స్థానికులను సైతం కలచి వేస్తున్నది.


### 'హైడ్రా' కొరడా ఝులిపించేనా..

ప్రస్తుతం హైదరాబాద్‌లో హైడ్రా చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతు న్నది. ఈ నేపథ్యంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు చేసిన వ్యాపారులతోపాటు ప్లాట్లు కొని నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లోనూ గుబులు మొదలైంది. ఇదే తరహాలో మాసబ్‌చెరువుపై హైడ్రా దృష్టి సారించి.. చెరువుకు సంబంధించిన భూముల్లో ఆక్రమణలను గుర్తించి, అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే స్థానికుల నుంచి పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.




## ఫైళ్లు కదలవేమీ ?





**ప్రభుత్వ పెద్దలు చెబితేనే.. హెచ్‌ఎండీఏలో దస్త్రాలకు మోక్షం లేదంటే దుమ్ము కొట్టుకుపోవాల్సిందే**

hmda Growing Global

సిటీబ్యూరో, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ) బాసు చెప్పేదెప్పుడు..మోక్షం కలిగేదెప్పుడు..అన్నట్లు తయారైంది హెచ్‌ఎండీఏలో ఫైళ్ల కథ. ప్రభుత్వ పెద్దలు చెబితే తప్ప..నెలలు గడిచినా..దస్త్రాలు కదలడం లేదు. రాజు తలుచుకుంటే రాజ భోగాలకు ఢోకా ఉండదనే మాటను హెచ్‌ఎండీఏ అధికారులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు. రాజు చెప్పడమే ఆలస్యం... ఏ కారణంతోనైనా పెండింగ్‌లో ఉన్న ఫైల్.. చెప్పిన గడువులోగా క్లియర్ కావాల్సిందే. అందుకు అధికారులే ప్రత్యేక రూట్ మ్యాప్‌తో ఫైల్స్ క్లియరెన్స్ కోసం ఆరాటపడుతున్నారనే చర్చ నడుస్తున్నది. ఎంఎస్‌బీ, ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, ఎన్‌వోసీ, బిల్డింగ్ పర్మిషన్ల విషయంలో తలెత్తే వివాదాల విషయంలో హెచ్‌ఎండీఏ వేదికగా జోరుగా పైరవీలు సాగుతున్నాయి. ముఖ్యంగా ప్లానింగ్ విభాగంలో ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు ఈ విషయంలో మరింత వేగంగా స్పందిస్తున్నారు. రెఫరెన్స్ రావడమే తరువాయి అన్నట్లు కమిషనర్‌తో నేరుగా ఫైళ్లపై చర్చించేంత చొరవ తీసుకొని.. వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

– సిటీబ్యూరో, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ)

### పూర్తి స్థాయి కమిషనర్ ఉన్నా...

గతంలో పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో పర్మిషన్ల విషయంలో జాప్యం జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శలు చేశారు. అయితే హెచ్‌ఎండీఏకు పూర్తి స్థాయి కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు తీసుకుని మూడు నెలలు గడుస్తున్నా... సంస్థ పాలనపై పట్టు సాధించలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దలు, లేదా పురపాలక శాఖ ఉన్నతాధికారులు చెబితే తప్ప.. ఫైల్స్ విషయంలో స్పందించడం లేదని సమాచారం. కింది స్థాయి అధికారులు కూడా తమకొచ్చిన బాధ ఎందుకని.. దరఖాస్తుదారులు వస్తే.. ఉన్నతాధికారుల పేరు చెప్పి.. తప్పించుకోవడమనేది ఆనవాయితీగా మారుతున్నది.

### మూలుగుతున్న 260కిపైగా దస్త్రాలు

హెచ్‌ఎండీఏలో అవినీతిరహిత పాలనాపరమైన అంశాలకు పెద్ద పీట వేసేలా గతంలో టీఎస్‌బీపాస్ వంటి ఆన్‌లైన్ మాధ్యమాలను ప్రవేశపెట్టారు. దాదాపు ఆన్‌లైన్ వేదికగా పారదర్శకంగా పనులు జరిగేలా ఐటీ విభాగాన్ని బలోపేతం చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆఫీస్ పనితీరులో మార్పులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా... ఫైల్ స్టేటస్ అప్‌డేట్ కాకుండా ఉంచడం, ఫైల్ పురోగతి, షార్ట్ ఫాల్ విషయంలో అంశాల కోసం కార్యాలయాల కోసం రావాల్సి వస్తున్నదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇక హెచ్‌ఎండీఏకు ఆదాయం సమకూర్చే ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, మల్టీ స్టోర్డ్ బిల్డింగ్, ఎన్‌వోసీతోపాటు, బిల్డింగ్ పర్మిషన్ల విషయంలోనైతే ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తేనే.. ఫైల్ ముందుకు కదలుతున్నదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 260కిపైగా ఫైళ్లు ఆయన వద్దే మూలుగుతున్నాయని తెలిసింది. ఇక మున్సిపల్ శాఖను కూడా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుండటంతో ఫైళ్ల విషయంలో ఆచితూచి స్పందించి, క్లియరెన్స్ ఇస్తున్నారని, ఏదైనా నోట్ ఫైల్ ఉంటే గానీ దస్త్రాలు ముందుకు కదిలే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు రిఫరెన్స్ ఇస్తే గానీ దరఖాస్తులపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.

## అరకొర సాయంతో అవస్థలు..

**ఇంటి నిర్మాణానికి మరింత సాయమందించాలని ప్రభుత్వానికి బాధితురాలు వేడుకోలు**



వర్షానికి కూలిన ఇల్లు (ఫైల్)



అప్పు చేసి నూతన గృహాన్ని నిర్మించుకుంటున్న బాధితురాలు కనకమ్మ

వికారాబాద్, సెప్టెంబర్ 14 : ఇటీవల భారీ వర్షాల కారణంగా వికారాబాద్ మండలంలోని పలు ఇండ్లు కూలిపోయాయి. కూలిపోయిన ఇండ్లకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తున్నది. ఇంటి నిర్మాణానికి ఏ మాత్రం సరిపోవడం లేదని, అప్పులు తేవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో గాలి రవి, కనకమ్మలు నివసిస్తున్న ఇల్లు అకాల వర్షాలకు కూలింది. ఇంట్లో ఐదుగురు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఎకరంన్నర పొలం ఉన్నా కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నామని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఇటీవల నష్టపరిహారంగా రూ.16,500 ఇచ్చిందని, కనీసం ఇటుకలు కూడా రాలేదన్నారు. ఇంటి నిర్మాణానికి ఇటుకలు, రేకులు, సిమెంట్, ఇసుక తదితర వాటికి రూ.70వేల వరకు అప్పు చేసి ఖర్చు పెట్టామని తెలిపింది. రాష్ట్ర సర్కార్ స్పందించి మరింత సాయం అందించాలని కోరారు.